
సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం | 20 | జూన్ | 2023



బస్సెక్కుదాం.. బడికి పోదాం

పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో.. విద్యార్థులకు ఉచిత, రాయితీ బస్సు పాస్‌లు అందజేసేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. - 8లో▸



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.5°/27.3°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	36.0	29.5
కాకినాడ	32.1	27.3
అమలాపురం	38.5	29.0

న్యూస్‌రీల్

ఆరోగ్య మిత్రకు ప్రోత్సాహక పురస్కారం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉత్తమ పనితీరు కనబర్చిన ఆరోగ్య మిత్రకు ప్రతి నెల ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు పురస్కారం అందించనున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇద్దరు ఆరోగ్య మిత్రలకు రూ.5 వేలు చొప్పున చెక్కును జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ పి. ప్రియాంకతో కలిసి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం అమలుకు విధినిర్వహణలో బాధ్యతాయుతంగా సేవలందించిన కె. పుష్పకుమారికి, ఎం. సత్యనారాయణలకు పురస్కార చెక్కును అందజేశామన్నారు. ఆరోగ్య మిత్రలు అందచేసే సేవల ఆధారంగా ప్రతి నెలా ఒకరిని ప్రోత్సాహక పురస్కారానికి ఎంపిక చేస్తామన్నారు. ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టరు ఎస్. తేజ్ భరత్, కార్పొరేషన్ కమీషనర్ కె. దినేష్ కుమార్, డీఆర్వో జి. నరశింహులు, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ పి. ప్రియాంక తదితరులు ఉన్నారు.

స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో జాతీయ ఆరోగ్యమిషన్ పరిధిలో మిగిలి ఉన్న వివిధ స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేసేందుకు మంగళ,బుధవారాల్లో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కె.వెంకటేశ్వర రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బొమ్మూరులోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు పూర్తిచేసిన దరఖాస్తు విద్యార్హత నకళ్లను జతపరచి మంగళ,,బుధ వారాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల్లోపు సంప్రదించాలన్నారు. పీడియాట్రీషిన్-2..గైనకాలజిస్ట్-2..అనస్థీషియా-1. జనరల్ మెడిసిన్-1..టిబిహబ్‌లో జనరల్ మెడిసిన్-1 పోస్టులు భర్తీ చేయనున్నారు. వేతనం రూ. 1.10లక్షలు ఉంటుందని కలెక్టర్ వివరించారు.

జిల్లా స్థాయి స్పందనకు 138 అర్జీలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరు మాధవీలత, జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్‌రెడ్డి, జేసీ తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఏ ఒక్క అర్జీ రీ ఓపెన్ కాకుండా పటిష్టవంతంగా నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించాలని జిల్లా అధికారుల సూచించారు. అర్జీదారునికి ఇచ్చే సమాధానం సమగ్రంగా ఉండాలన్నారు. అర్జీల పట్ల అత్యంత శ్రద్ధ వహించి పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా 1902 నంబరుకు ప్రజలు సమస్యలను తెలియ జేస్తున్నారన్నారు. స్పందనలో 138 అర్జీలను స్వీకరించారు. ఇందులో పోలీసు శాఖకు సంబంధించి 19 అర్జీలు ఉన్నాయి.

లోవకు హుండీల ద్వారా రూ.22 లక్షల ఆదాయం

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.22,10,026 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ ధర్మాదాయశాఖ పెద్దాపురం తనిఖీ అధికారి సీహెచ్ ఉదయబాబు నాయుడు పర్యవేక్షణలో సోమవారం లోవదేవస్థానంలో హుండీలను తెరిచి ఆదాయం లెక్కించారు. నాణేల రూపంలో రూ.80,352, నోట్ల రూపంలో రూ.21,29,674 వెరసి మొత్తం రూ.22,10,026 ఆదాయం లభించిందన్నారు.

కుష్ఠువ్యాధి సమూల నిర్మూలనే లక్ష్యం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కుష్ఠువ్యాధిని జిల్లా నుంచి సమూలంగా నిర్మూలించడమే లక్ష్యమని కలెక్టర్ మాధవీలత అన్నారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంపై సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్లో అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధిపై అవగాహన పెంచుకోవడం ద్వారా నిర్మూలన సాధ్యమన్నారు. డాక్టర్లు సూచించిన విధంగా బాధితులు మందులు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ప్రజలు నిర్భయంగా బయటకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమైకమవుతున్న దృష్ట్యా మరింత బాధ్యత తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్, మునిసిపల్, వైద్య ఆరోగ్య, సమాచార శాఖల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు, జిల్లా ఎయిడ్స్, కుష్ఠువ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.వసుంధర పాల్గొన్నారు.

వరిస్తున్న ఖరీఫ్..!

- జిల్లాలో ఊపందుకున్న నారుమళ్లు
- వరి సాధారణ సాగు 78,789 హెక్టార్లు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- ఎండవేడికి తాళలేక నారుమళ్ల ప్రక్రియలో స్వల్ప జాప్యం

మునగాలలో నారుమళ్లు



సాక్షి, రాజమహేంద్రవరం: ఖరీఫ్ సాగు 'వరి'స్తోంది. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ ద్వారా డెల్టా ఆయకట్టుకు ముందస్తుగా సాగునీటి విడుదల చేయడం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి ఉంచడం. ఇలా ఆది నుంచీ అనుకూల పవనాలు వీయడంతో కర్షకులు ఉత్సాహంగా కాడిపట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా నారుమళ్లు ఊపందుకుంటున్నాయి. సోమవారం నాటికి 46 శాతం ఆయకట్టుకు అవసరమైన నారుమళ్లు పోశారు. మరో వైపు మెట్ట ప్రాంతాల్లో వెద పద్ధతిలో నాట్లు వేసే ప్రక్రియ ప్రారంభమైంది. 91 హెక్టార్లలో నాట్ల ప్రక్రియ పూర్తయింది.

ఊపందుకున్న నారుమళ్లు

జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా వరి సాగు చేపడుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 78,769 హెక్టార్లలో వరి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. 3,729 హెక్టార్లలో నారు మళ్లు పోయాల్సి ఉండగా ఇప్పటివరకూ 1,710 హెక్టార్లలో పూర్తయ్యాయి. 46 శాతం ఆయకట్టులో ప్రక్రియ పూర్తయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రధానంగా కొవ్వూరులో 89 శాతం, నిడదవోలు 69, ఉండ్రాజవరం 63, సీతానగరం 53 శాతం ఆయకట్టుకు నారుమళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో సైతం వేగవంతంగా సాగుతోంది. ఎలాగైనా త్వరితగతిన పూర్తి చేసి నాట్లు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

91 హెక్టార్లలో వెదజల్లే పద్ధతిలో నాట్లు:

ఓ వైపు నారుమళ్లు ఊపందుకోగా.. మరో వైపు వెద పద్ధతిలో నాట్ల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో ఇప్పటికే 91 హెక్టార్లలో నాటు వేశారు. సీతానగరంలో 50 హెక్టార్లు, చాగల్లు 2, గోపాలపురం 4, కొవ్వూరు 10, నిడదవోలు 5, తాళ్లపూడి మండలంలో 20 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. వరి సాగులో 'వెదజల్లే' విధానానికి అత్యంత ఆదరణ దక్కుతోంది. పరిమితంగా సాగు వ్యయం, కూలీల ఖర్చులు, అవసరం తగ్గుతుండటం, నీటి తడులు ఎక్కువగా ఇవ్వాల్సిన అవసరం లేకపోవడంతో ఈ విధానంపై రైతులు మక్కువ చూపుతున్నారు. డెల్టా, మెట్ట ప్రాంతాలన్న బేధం లేకుండా ఎవర్‌గ్రీన్‌గా వెలుగొందుతోంది.

నీటి ఢోకా లేదు..!

ఖరీఫ్ సాగుకు నీటి ఇబ్బందులు తలెత్తవని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. సీజన్‌లో 1,94,609 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం. జిల్లాలో అత్యధిక సాగు భూమి మెట్ట ప్రాంతంలోనే ఉంది. జిల్లా సెమీడెల్టా సిస్టం కింద ఉండటంతో అంటే 60 శాతం బోరు బావుల నీటితో సాగు చేసుకునే సౌకర్యం ఉండటంతో సాగునీటి సమస్య తలెత్తదన్నది అధికారుల వాదన. 1,77,927 ఎకరాల్లో బోర్లపై, 18 శాతం గోదావరి డెల్టా, 11 శాతం చెరువుల కింద, మరో 11 శాతం ఎత్తిపోతల పథకాల నీటితో సాగవుతోంది. 22,543 హెక్టార్లు మాత్రమే వర్షాధారం. జిల్లా వ్యాప్తంగా 15 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. బోరు నీటి ద్వారా సాగయ్యే ఆయకట్టుకు సైతం ఈ పథకాలు కొంతమేర నీటిని అందిస్తున్నాయి. ఈ పరిణామం సాగునీటి సమస్యను అధిగమించేందుకు దోహదపడుతోంది. ఇప్పటికే గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల చేశారు. 25న ఎర్రకాలువ, 22న పుష్కర, జూలై 1 నుంచి ముసురుమిల్లి ప్రాజెక్టు, జూలై మొదటి వారంలో సూరంపాలెం, తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేయనున్నారు. నీటి విడుదల ప్రాంభమైతే సాగు మరింత ఊపందుకోనుంది.

జిల్లాలో వరి నారుమళ్ల ప్రక్రియ (హెక్టార్లలో) ఇలా..

మండలం	సాధారణ విస్తీర్ణం	ఇప్పటి వరకు నారుమళ్లు	శాతం
రాజమండ్రి రూరల్	1512	14	19
కడియం	2279	51	50
రాజానగరం	4983	130	52
అనపర్తి	3865	50	37
బిక్కవోలు	6309	75	30
కోరుకొండ	6046	45	15
గోకవరం	5081	28	12
సీతానగరం	5669	150	53
రంగంపేట	2876	62	46
చాగల్లు	3565	140	79
దేవరపల్లి	3804	80	42
గోపాలపురం	4123	32	16
కొవ్వూరు	4747	209	89
నిడదవోలు	7311	245	69
పెరవలి	3381	50	30
తాళ్లపూడి	3838	98	52
ఉండ్రాజవరం	5008	150	63
నల్లజెర్ల	4392	101	46

సకాలంలో విత్తనాల సరఫరా

పంట సాగుకు అవసరమైన విత్తనాలు **ముందస్తుగానే** అందుబాటులో ఉంచారు. **54,000 క్వింటాళ్ల** విత్తనాల ఆవస్యకత ఉంది. **రైతుల అ**వసరానికి అనుగుణంగా రైతు **భరోసా కేంద్రాల్లో** 400 క్వింటాళ్లు, ప్రైవేటు **డీలర్ల వద్ద** 5,600 క్వింటాళ్లు అందుబా**టులో ఉంచారు**. పంట దిగుబడిలో ఎరు**వులది కీలక** పాత్ర. అంతటి ప్రాధాన్యం **కలిగిన ఎరువు**లను ఖరీఫ్ సీజన్ ప్రారం**భానికి ముందే** ప్రభుత్వం ఆర్బీకేల్లో అందు**బాటులో ఉ**ంచింది. సీజన్‌కు మొత్తం **58,356** మెట్రిక్ టన్నుల ఎరువుల **ఆవస్యకత** ఉండగా.. ఇప్పటికే 21,792 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. యూరియా 6,962 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,539, ఎంఓపీ 1,934, కాంప్లెక్స్ 5,469, ఎస్ఎస్‌పీ 3,889 మెట్రిక్ టన్నులు సిద్ధం ఉన్నాయి.

రుతు పవనాలతో కాస్త ఆలస్యం

నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో మెట్ట ప్రాంతాల్లో నారుమడులకు కాస్త ఇబ్బందులు తలెత్తాయి. భానుడి ఉగ్ర రూపం దాల్చడం, ఎండలు మండిపోవడం, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో నారుమళ్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. గతేడాది ఇదే సమయానికి వర్షాల ప్రభావం ఉండటంతో నారుమళ్ల ప్రక్రియ ఊపందుకుంది. సోమవారం వాతావరణం కాస్త చల్లబడటంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు భావించారు. మధ్యాహ్నం తర్వాత తిరిగి ఎండల తీవ్రత పెరగడంతో రుతు పవనాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందిస్తున్నారు. నేను ప్రస్తుతం 8 ఎకరాల్లో నారుమళ్లు పోశాను. బోరు సౌకర్యం ఉండటంతో సాగునీటి సమస్య లేదు. గతేడాది ఇదే సమయానికి 10 ఎకరాల్లో నారుమళ్లు పోశా. ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యం కావడంతో కాస్త ఆలస్యమైంది. ప్రభుత్వం నీరు విడుదల చేస్తుండటంతో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– గిత్తావెంకట సత్యనారాయణ, రైతు, కోరుకొండ మండలం మునగాల

సేంద్రీయ ఎరువులతో సత్ఫలితాలు



జిల్లాలో నారుమళ్ల ప్రక్రియ వేగంగా సాగుతోంది. నారుమడిలో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే సత్ఫలితాలు అందుతాయి. మురగ దమ్ము చేసుకుని దంపు ఆకుమళ్లు పోసుకుంటే 20 రోజుల్లోనే నాట్లకు నారు సిద్ధమవుతోంది. జిల్లాలో ఇప్పటికే వెద పద్ధతిలో 91 హెక్టార్లలో నాట్లు వేశారు. ఇవి ఇంకా ఊపందుకోనున్నాయి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

గౌరవ వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఆరిఫ్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆదాయం లేని మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్లు గౌరవ వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేల గౌరవ వేతనం అందిస్తోందన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని వక్ఫ్ బోర్డ్ విభాగంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 99595 62302, 98850 48850 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీసు స్పందనకు 30 ఫిర్యాదులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 30 అర్జీలు వచ్చాయి. వీటిని జిల్లా అడిషనల్ ఎస్పీ యం.రజనీ పరిశీలించారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడారు. వారికి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కార దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసు స్పందన కార్యక్రమానికి కుటుంబ తగాదాలు 5, సివిల్ తగాదాలు 16, ఇతర ఫిర్యాదులు 9 అందాయి. వీటిని జోనల్ డీఎస్పీల సమక్షంలో ఏఎస్పీ స్వీకరించి చట్టప్రకారం విచారణ జరిపించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యలను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరిస్తామని అర్జీదారులకు ఆమె హామీ ఇచ్చారు.

మాదక ద్రవ్యాల కట్టడికి కార్యాచరణ

కలెక్టర్ మాధవీలత, ఎస్పీ సుధీర్ కుమార్

సీటీ ఆర్ఐ(రాజమహేంద్రవరం): గంజాయి, మాదక ద్రవ్యాలను సాగు చేస్తున్న, రవాణా చేస్తున్న వారి వివరాలు తెలియజేయాలని కలెక్టర్ మాధవీలత కోరారు. తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అంతేకాకుండా రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు నగదు పురస్కారం అందజేస్తామన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్‌తో కలిసి ఆమె జిల్లా స్థాయి జాతీయ ఔషధ డిమాండ్ తగ్గింపు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అమ్మకాలు జరిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి ఆస్తులను, బంధువుల ఆస్తులను కూడా జప్తు చేస్తామని పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ కింద నషా ముక్త్ పంచాయతీ అనే కార్యక్రమం కూడా ప్రారంభించారన్నారు. డ్రగ్స్ వినియోగ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు శాఖల మధ్య సమన్వయం, తోడ్పాటు అవసుమన్నారు. మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు జిల్లాలోని ఎంట్రీ పాయింట్ల వద్ద ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్ డిటెక్షన్ సెంటర్ ..అడిషనల్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు.

అమ్మకం.. వినియోగం కట్టడి

ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి అమ్మకాలు, వినియోగాన్ని నిరోధించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలలు, నగర శివారు నివాస ప్రాంతాలు, నదీ తీరాలు, సాధువులు ఉండే ప్రాంతాలపై నిఘా పెట్టామన్నారు. కొందరు చిరు వ్యాపారులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు గంజాయి వినియోగిస్తున్నట్లు దృష్టికి వచ్చిందని అన్నారు. వారిని గుర్తించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 16 కేసులు నమోదయ్యాయన్నారు. ఇప్పటివరకు 53 మంది నిందితులను అరెస్టు చేసి రూ.78,73,835 విలువ గల 1574.767 కిలోల గంజాయితో పాటు 10 వాహనాలను కూడా స్వాధీనం పరుచు కున్నామన్నారు. 53 మంది నిందితుల్లో 46 మంది మన రాష్ట్రానికి చెందిన వారన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, డీటీవో(ట్రాన్స్ పోర్టు) కె.ఎస్.ఎం.వి కృష్ణారావు, డీఎస్పీ సౌత్ జోన్ కె. శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ వై. ప్రకాష్ రావు, జీ హెచ్ సైకాలజిస్ట్ డా అఖిల, డిఎస్పీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ సుధీర్‌కుమార్, కలెక్టర్ మాధవీలత

22న జాబ్‌మేళా



మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: తాడితోట సంహిత కన్వెన్షన్ హాలులో ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ప్రభాకర్ నిధి లిమిటెడ్ వారి ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ప్రకాశం నగర్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోమవారం ఆవిష్కరించారు. ఈ మేళాలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, టెలికాలర్స్, డేటా కలెక్షన్ ఏజెంట్లు, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. వీటికి ఇంటర్, డిగ్రీ, పీజీ – బ్యాంకింగ్ ప్రొఫెషనల్ కోర్సులు చేసిన వారు అర్హులు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఇటువంటి మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ నిధి లిమిటెడ్ ప్రతినిధులు, యాంకర్ చోటు పాల్గొన్నారు.

నిన్న మాట ఇచ్చారు..నేడు పట్టా ఇచ్చారు



రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రేవాడి దుర్గ (పాత చిత్రం)



రేవాడిదుర్గకు ఇంటిస్థలపట్టా అందజేస్తున్న జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: మాటిస్తే అమలు చేస్తానని మరోమారు నిరూపించుకున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వివరాలివి. ముఖ్యమంత్రి గత నెల 24న కొవ్వూరు పర్యటనకు వచ్చారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరుకు వలస వచ్చిన రేవాడి దుర్గ దంపతులు ఈసందర్భంగా ముఖ్యమంత్రిని కలిశారు. ఇంటి స్థలం అవస్థలు పడుతున్నామని ఆయనకు అర్జీ అందజేశారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ ఇళ్ల స్థలం మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలతను ఆదేశించారు. ఆమె చొరవ తీసుకుని సాంకేతిక పరంగా ఉన్న అడ్డంకిని పరిష్కరించి కొవ్వూరు జగనన్న కాలనీలో నివాస స్థలం మంజూరు చేశారు. సోమవారం దుర్గకు ఇంటి పట్టా అందజేశారు. రేవాడి దుర్గ మాట్లాడుతూ తమకు ఇంత త్వరగా ఇంటి స్థలం మంజూరవుతుందని ఊహించలేదని సంతోషం వ్యక్తం చేశారు.సీఎం జగన్‌కు.. కలెక్టర్ మాధవీలతకు కృతజ్ఞతలు తెలిపారు.

సముద్రంలో బోటు బోల్తా



సముద్రంలో బోల్తా పడిన బోటు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి వస్తూం డగా ప్రమాదవశాత్తూ బోటు బోల్తా పడిన ఘట నలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. మత్స్యకా రుల కథనం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరానికి చెందిన గరికిన నూకరా జుతో పాటు ఎనిమిది మంది మత్స్యకారులు అక్కడి తీరం నుంచి తన బోటుపై సోమవారం తెల్లవారుజామున సముద్రంలో వేటకు వెళ్లారు. వేట ముగించుకుని అమీనాబాదు తీరానికి వస్తూం డగా కెరటాల ఉధృతికి బోటు ఒక్కసారిగా బోల్తా పడింది. అందులోని మత్స్యకారులు తోటి వారి సహాయంతో తీరానికి క్షేమంగా చేరుకున్నారు. బోటు సముద్రంలో ఉండగానే రెండు వలలు, మత్స్యసంపద పూర్తిగా కొట్టుకుపోయాయని, సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.

బస్సెక్కుదాం..బడికి పోదాం



- ఉచిత, రాయితీ బస్సు పాసుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు
- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితం
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రజా రవాణా శాఖ
- గత ఏడాది జిల్లాలో 52 వేల మందికి ప్రయోజనం

రాయవరం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. దూర ప్రాంతాలకు వెళ్లి చదివే విద్యార్థులు ఉదయాన్నే ఆయా స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేందుకు వివిధ మార్గాలు ఎంచుకుంటారు. పల్లెల నుంచి పట్టణ ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, వాహన సౌకర్యం లేని వారు ఆర్టీసీ బస్సులలో వెళ్తారు. వీరి కోసం ప్రజా రవాణా శాఖ ఏటా ఉచిత, రాయితీ బస్సు పాసులు మంజూరు చేస్తోంది. జిల్లాలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్సు పాస్‌లు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కౌంటర్లు ప్రారంభించారు. బస్సు పాస్‌లకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. పాస్‌లు కావాల్సిన వారు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీపీఎఎస్ఎస్.ఇన్' వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి, దరఖాస్తు చేసుకోవాలి. కళాశాల విద్యార్థులు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సెల్ నంబరు ఇవ్వాలి. దరఖాస్తులను సమీప డిపో మేనేజర్ పరిశీలించి, పాస్ మంజూరుకు సిఫారసు చేస్తారు. వీటిని మంజూరు కౌంటరులో ఇచ్చి, నిర్ణీత రుసుం చెల్లించి పాస్ పొందవచ్చు.

చదువులకు ఊతమిచ్చేలా..

- అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు అందించే తోడ్పాటులో భాగంగా ప్రజా రవాణా శాఖ 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాస్‌లు జారీ చేస్తుంది. ఇవి ఏడాది పాటు చెల్లుబాటు అవుతాయి. వీటి ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకూ బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చు. దీనికోసం విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి ధృవీకరణ పత్రం (బోనఫైడ్ సర్టిఫికెట్) సమర్పించాలి.
- మిగిలిన వారికి రాయితీతో బస్సు పాస్‌లు మంజూరు చేస్తారు. చదువుకునే ప్రతి విద్యార్థీ ఈ రాయితీ బస్సు పాస్ పొందవచ్చు. మొత్తం చార్జీలో ఒక వంతు మాత్రమే విద్యార్థి చెల్లించేలా ఈ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థి నివాసం నుంచి 50 కిలోమీటర్ల వరకూ రాయితీ పాస్ జారీ చేస్తారు. బస్సు రూటు ఆధారంగా రాయితీ చార్జీని విద్యార్థులకు నిర్ణయిస్తారు. కళాశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాలి. విద్యార్థి ఫొటో జత చేయాలి.
- పాస్ ధరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డు రూ.50, సర్వీసు చార్జీ రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్సు పాస్‌లను నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితితో మంజూరు చేస్తారు. గడువు ముగిశాక రెన్యువల్ కోసం ప్రిన్సిపాల్ సంతకం చేయించుకుని, తిరిగి పొందాల్సి ఉంటుంది.
- సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెలలో కూడా పాసులు మంజూరు చేస్తారు.
- ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణించి, దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు.
- రామచంద్రపురం, రావులపాలెం, రాజోలు, అమలాపురం డిపోల నుంచి గత ఏడాది ఉచిత, రాయితీతో పాటు దివ్యాంగులకు సుమారు 52 వేల బస్సు పాస్‌లు అందజేశారు.
- దివ్యాంగులైన విద్యార్థులకు కూడా ఉచితంగా బస్సు పాస్‌లు అందిస్తున్నారు. దీనికోసం సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి. మూడేళ్ల కాల వ్యవధితో పాస్‌లు జారీ చేస్తారు. ఐడీ కార్డుకు రూ.100 చెల్లించాలి.

సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనందున బస్సు పాస్‌ల జారీ ప్రక్రియను ప్రారంభించాం. ప్రభుత్వం అందించే బస్సు పాస్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సదరం సర్టిఫికెట్ పొందిన దివ్యాంగులకు (విద్యార్థులు కాని వారు) 50 శాతం రాయితీతో బస్సు పాస్‌లు జారీ చేస్తున్నాం.

– కె.వెంకటేశ్వర్లు, మేనేజర్, రామచంద్రపురం ఆర్టీసీ డిపో

22 నుంచి కళాసమ్మేళనం

- 14 గంటల పాటు నిర్విరామ నృత్య ప్రదర్శన
- ఐదు ప్రపంచ రికార్డులకు ప్రయత్నం



వివరాలు వెల్లడిస్తున్న జీబీ నారాయణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక ఆనం కళా కేంద్రంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ కళా సమ్మేళనం పేరిట జాతీయ స్థాయి నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు రాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు జీబీ నారాయణ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, రాధాకృష్ణ ట్రస్ట్, రాధాకృష్ణ కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్ట్ రూబే–2023 పేరిట ఈ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రూబే 40వ వార్షికోత్సవం సందర్భంగా 22వ తేదీ ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఐదు ప్రపంచ రికార్డుల కోసం 14 గంటల 2 నిమిషాల 2 సెకండ్ల పాటు రాధాకృష్ణ కళాక్షేత్రకు చెందిన 101 మంది విద్యార్థులతో 101 సార్లు హనుమాన్ చాలీసా నృత్య ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఒకే వేదిక నుంచి వైదిక సిద్ధాంతంలో శ్రీనివాస కల్యాణం జరుగుతూండగా లలిత, జానపద పెళ్లిపాటలకు నృత్య ప్రదర్శన చేస్తామన్నారు. దీనిలో భాగంగా 23వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు, సాయంత్రం 6 నుంచి శ్రీనివాస కల్యాణం జరుగుతాయని తెలిపారు. 24వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు ఉంటాయన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి చెరుకుమిల్లి సిరిచందన కూచిపూడి అరంగేట్రం ఉంటుందన్నారు. 25వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకూ జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు, సాయంత్రం 4 నుంచి సంగీత, నాట్య శాస్త్రాలపై ప్రముఖులతో చర్చా వేదిక, సాయంత్రం 6 నుంచి బహుమతి ప్రదానం నిర్వహిస్తామని నారాయణ వివరించారు. డాక్టర్ కుషల్ భట్టాచార్య (కోల్‌కతా), పోతిన శ్రీనివాస్ (హైదరాబాద్), గోరుగంతు ఉమాజయశ్రీ (రాజమహేంద్రవరం), తిరుపతి ఎస్వీ కళాశాల లెక్చరర్ తిరుపతి యాళ్ల శ్రీవాణి న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ కె.మాధవీలత, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. శైవక్షేత్ర శివస్వామి (గుంటూరు), కాకినాడ సెట్రాజ్ సీఈఓ షేక్ ఇమ్రామ్, కూచిపూడి కళాకారిణి, పద్మశ్రీ శోభానాయుడు శిష్యురాలు యశోదా ఠాకూర్ కూడా హాజరు కానున్నారని తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి జేసీబీకి మంటలు

విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి



డ్రైవర్ సహదేవ్ మృతదేహం

రాజానగరం: ట్రాలీపై తరలిస్తున్న జేసీబీకి విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో విద్యుదాఘాతానికి గురై దానిలోని డ్రైవర్ మృతి చెందాడు. మండలంలోని శ్రీకృష్ణపట్నం - భూపాలపట్నం మధ్య సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట నుంచి పుణ్యక్షేత్రానికి ట్రాలీపై జేసీబీని తరలిస్తున్నారు. ట్రాలీపై ఇద్దరు వ్యక్తులు నిలబడి కర్రలతో విద్యుత్ తీగలను జేసీబీకి తగలకుండా పైకి లేపుతున్నారు. అయితే ఆ ఇద్దరిలో ఒకరు ట్రాలీ కుదుపునకు పడిపోవడంతో విద్యుత్ తీగలు జేసీబీకి తగిలాయి. వెంటనే స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. అయితే జేసీబీలోని డ్రైవర్ జార్ఖండ్‌కి చెందిన సహదేవ్ (50) విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని 108లో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే అతడు చనిపోయాడని వైద్యులు తెలిపారు. కాగా.. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు ఆస్పత్రి నుంచి సమాచారం రావాల్సి ఉందన్నారు.

ప్రశాంతంగా ఎంఈఓ-2 పోస్టుల కౌన్సెలింగ్

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎంఈఓ-2 పోస్టుల భర్తీకి నిర్వహించిన కౌన్సెలింగ్ సోమవారంతో ప్రశాంతంగా ముగిసింది. అవిభక్త తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 64 మండలాలకు ఎంఈఓ-2 పోస్టుల నియామకానికి ఆదివారం ఈ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. తొలి రోజు 47 మండలాలకు మాత్రమే అభ్యర్థులు కోరుకోగా, మిగిలిన 17 మండలాలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత 325 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలతో సీనియార్టీ జాబితా విడుదల చేశారు. ఎంఈఓ-2 పోస్టుకు ఆప్షన్ ఇచ్చేందుకు పలువురు హెచ్‌ఎంలు నిరాకరించారు. దీంతో తిరిగి 90 మందితో సీనియారిటీ జాబితా రూపొందించి, రెండో రోజు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 57 మంది నియామకాలు జరగగా, వారందరూ సోమవారం విధుల్లో చేరారు. మిగిలిన 7 పోస్టుల భర్తీకి త్వరలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కాకినాడ సమగ్ర శిక్షా సమావేశపు హాలులో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఏడీ కె.సుబ్బారావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంఈఓ-2 పోస్టులు మంజూరు చేసి, భర్తీకి చర్యలు తీసుకోవడంపై వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఇది క్షేత్ర స్థాయిలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసే చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చారిత్రక నిర్ణయమని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వరరావు, వీరవల్లి గోపీకృష్ణ 'సాక్షి'కి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ముమ్మిడివరం: దంపతుల మధ్య గొడవల నేపథ్యంలో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లికి చెందిన బళ్ల గోపాలరావు(49)కు, భార్య లక్ష్మికి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17న గోపాలరావు పురుగుల మందు తాగాడు. అతడిని బంధువులు అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

జగ్గంపేట: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముద్దాయికి పది సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ఏఎస్సై నూకరాజు కథనం ప్రకారం.. జగ్గంపేటకు చెందిన వైబోగుల వీర వెంకట రమణ ఎలియాస్ శ్రీను (23) 2016లో గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వంచించాడు. పెళ్లి ప్రస్తావన తేవడంతో ముఖం చాటేశాడు. దీంతో మోసపోయానని గుర్తించిన ఆ బాలిక అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం పోలీసులు 2017లో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వెంకటేశ్వరరావు నిందితుడు వెంకట రమణకు పదేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధిస్తూ తుది తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

మేడపై నుంచి పడి వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: మద్యం మత్తులో ఓ వ్యక్తి మేడపై నుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. శంఖవరం మండలం పెదమల్లాపురం శృంగధార గ్రామానికి చెందిన నాగోజు అప్పారావు (36) టెంట్‌హౌస్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. టెంట్‌హౌస్ సామాన్ల కొనుగోలు నిమిత్తం ఆదివారం కాకినాడ వచ్చాడు. తిరిగి వెళ్లే సమయానికి చీకటి పడటంతో నగరంలో ఉన్న స్నేహితుడు వెన్న నవీన్ క్రాంతి కుమార్ ఇంటికి రాత్రి బసకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరూ మద్యం తాగారు. అర్ధరాత్రి ఉక్కపోత కారణంగా ఇంటి బయటకు వచ్చి మేడ మీదకు ఎక్కిన అప్పారావు మద్యం మత్తులో కిందకు పడిపోయాడు. స్నేహితుడు గమనించి అప్పారావు భార్య రాజేశ్వరికి సమాచారం అందించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న ఆటో

- ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

ఆలమూరు: జొన్నాడ వద్ద 216ఏ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం.. పాలకొల్లు నుంచి ధవళేశ్వరం వెళుతున్న ఆటోలో డ్రైవర్ పట్నాల ప్రశాంత్, అవిడి రాంబాబు, ఎ.సత్తిబాబు ప్రయాణిస్తున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం సడన్ బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి, వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఆలమూరు 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని తీవ్ర రక్తస్రావంతో బాధ పడుతున్న క్షతగాత్రులను స్థానికుల సాయంతో ఆటోలో నుంచి బయటకు తీసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో డ్రైవర్ ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరయూర్ సేవా సహకార బ్యాంకును సందర్శించిన డీసీసీబీ చైర్మన్



మరయూర్ సేవా సహకార బ్యాంకు అధ్వర్యాన నడుస్తున్న రూరల్ హాట్ వద్ద ఆకుల వీర్రాజు తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు కేరళలోని మరయూర్ సేవా సహకార బ్యాంకును సోమవారం సందర్శించారు. 1936లో స్థాపించిన మరయూర్ సహకార బ్యాంకు ఏటా రూ.1.28కోట్లు లాభం సాధిస్తోందని, ఇందులో 10,950 మంది సభ్యులున్నారని ఆయన తెలిపారు. డిపాజిట్లు రూ.45 కోట్లు కాగా రూ.63 కోట్ల రుణాలిచ్చారని వివరించారు. ఈ బ్యాంకు ఆధ్వర్యాన సూపర్ మార్కెట్, రైతు సేవా కేంద్రం, మెడికల్ షాపు, అంబులెన్స్, రిసార్ట్స్, రూరల్ హాట్‌లు ఉన్నాయని తెలిపారు.

జిల్లా డీసీసీబీని కూడా లాభాల బాటలో పయనింపజేసేందుకు మరయూర్ బ్యాంకు ఆచరిస్తున్న విధానాలను అమలు చేస్తామని ఈ సందర్భంగా వీర్రాజు చెప్పారు. అభివృద్ధి చెందిన సహకార బ్యాంకుల సందర్శనలో భాగంగా ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి నేతృత్వంలో పలు జిల్లాలకు చెందిన డీసీసీబీ చైర్మన్లు ఈ సందర్భంలో పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలు ప్రారంభం



హెల్త్ వర్కర్లకు బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ పద్మశశిధర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య, ఆరోగ్య శాఖ జోన్-2 పరిధిలోని హెల్త్ వర్కర్ల బదిలీల కౌన్సెలింగ్ స్థానిక రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైంది. జోన్-2 పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి. వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పి.పద్మశశిధర్ బదిలీల ప్రక్రియ నిర్వహించారు. తొలి రోజు పబ్లిక్ హెల్త్ నర్స్, హెల్త్ ఎడ్యుకేటర్ క్యాడర్లకు బదిలీలు నిర్వహించి 11 మందికి ఉత్తర్వులు ఇచ్చారు. కౌన్సెలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగిందని పద్మ శశిధర్ అన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుంది.

గృహ నిర్మాణదారులకు సువర్ణావకాశం

- లబ్ధిదారులకు అడ్వాన్స్‌గా బిల్లు చెల్లింపు
- నిర్మాణం ఏ స్థాయిలో ఉన్నా రూ.20 వేలు
- కొత్తగా నిర్మాణం ప్రారంభించుకునే వారికీ అవకాశం
- 'తూర్పు' వ్యాప్తంగా 11,027 మంది వివరాల నమోదు

కొవ్వూరు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇప్పటి వరకూ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో పాటు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న వారికి సైతం అడ్వాన్స్ పేమెంట్ అందిస్తోంది. ఒక్కో లబ్ధిదారుకు ముందస్తుగా రూ.20 వేల చొప్పున బిల్లు ఇస్తున్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా తొలుత పునాది స్థాయి వరకూ నిర్మించుకున్న వారికి అవకాశం కల్పించారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) శివప్రసాద్ శనివారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకూ పునాది స్థాయి కంటే తక్కువ (బిలో బేస్‌మెంట్ లెవెల్ – బీబీఎల్), పునాది స్థాయి (బేస్‌మెంట్ లెవెల్) వరకూ నిర్మించుకున్న వారికి మాత్రమే ఈ అడ్వాన్స్ పేమెంటు అవకాశం ఇచ్చారు. దీనికి లబ్ధిదారుల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో సోమవారం మధ్యాహ్నం మరోసారి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసారి అసలు నిర్మాణ పనులు ప్రారంభించకుండా ఉన్న వారికి సైతం ఈ అవకాశం కల్పించారు. వివిధ స్థాయిల్లో నిర్మాణం పూర్తి చేసుకుని, సొమ్ములు లేక పనులు నిలిపివేసిన వారికి కూడా అవకాశం ఇచ్చారు.

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో వివిధ దశల్లో పనులు ప్రారంభించిన లబ్ధిదారులు 39,846 మంది ఉన్నారు. వీరిలో 11,027 మంది అడ్వాన్స్ పేమెంట్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. అడ్వాన్సు కావాలనుకునే వారు గ్రామ/వార్డు సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల లాగిన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



కొవ్వూరు మండలం కాపవరంలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

రూ.22.05 కోట్ల అడ్వాన్స్ పేమెంటుకు ప్రతిపాదనలు

జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్న లక్ష్యంతో గృహ నిర్మాణ శాఖ ఈ అడ్వాన్స్ పేమెంట్ విధానానికి చర్యలు తీసుకుంది. లబ్ధిదారుకు చెల్లించాల్సిన మొత్తం ఇంటి బిల్లు నుంచి ఈ మొత్తం ఇస్తారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి 9 గంటలకు నమోదైన వివరాలను బట్టి జిల్లాలో 11,027 మంది లబ్ధిదారులు అడ్వాన్స్ పేమెంట్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అంటే ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున జిల్లా వ్యాప్తంగా రూ.22,05,40,000 మేర గృహ నిర్మాణ శాఖ అడ్వాన్స్‌గా చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 27,982 మంది బీబీఎల్‌లో ఉన్నా వారిలో 5,071 మంది అడ్వాన్స్ పేమెంట్ కావాలని కోరారు. అలాగే ప్లింత్ బీమ్ స్థాయిలో 653 మంది, బేస్‌మెంట్ లెవెల్‌లో 3,976 మంది, లింటల్ లెవెల్‌లో 746 మంది, రూఫ్ లెవెల్‌లో 581 మంది చొప్పున అడ్వాన్స్ పేమెంట్ కావాలని కోరుతున్నారు.

లబ్ధిదారులకు ఆర్థిక వెసులుబాటు



గతంలో ఒక దశలో నిర్మాణం పూర్తి చేసిన తర్వాత అధికారులు పరిశీలించి, బిల్లుకు సిఫారసు చేసేవారు. ఇంటి నిర్మాణంపై ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు ముందస్తుగా అడ్వాన్స్ పేమెంట్ చేస్తాం. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ లాగిన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. లబ్ధిదారుకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించడం వలన ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యే అవకాశం ఉంది. వివరాలు నమోదు చేసిన రెండు, మూడు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తారు.

– డి.పరశురామ్, జిల్లా గృహ నిర్మాణ అధికారి, తూర్పు గోదావరి



